ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com



https://prajakalam.com
RNI No.TELTEL/2010/33275

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక



ప్రజా కలం PRAJA KALAM Telugu Daily
Classifieds & Public Notice Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526



ఆదివారం | 16-03- 2025 సంపుటి: 15 , సంచిక: 346, నిజామాబాద్ పేజీలు: 12, వెల: 3/- ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

Circulated to Hyderabad,Ranagareddy,Nizamabad, Warangal, Mulugu, Shadnagar, Yadadri, Nalgonda, karimnagar, khammam, Medak, Sangareddy, Siddipet, Medchal, Jagityal,Vemulawada


### కేసీఆర్ కుటుంబం మొత్తం బతికేది

# అబద్ధాల మీదే..



### ఎక్కడైనా చిన్న సంఘటన జరిగితే దాన్ని తీసుకుని చిలువలు పలువలు చేసి ప్రచారం చేస్తున్నారు

- సోషల్ మీడియా నియంత్రణకు అవసరమైతే చట్టం
- జర్నలిస్టు ముసుగేసినా క్రిమినల్‌గానే చూస్తాం
- అసెంబ్లీలో సీఎం రేవంత్ ఫైర్
- దుబాయ్ గుట్టు తన దగ్గర ఉందని హెచ్చరిక

**హైదరాబాద్, మార్చి 15(ప్రజాకలం ప్రతినిధి):** యూట్యూబ్, సోషల్ మీడియాను అడ్డం పెట్టుకుని, జర్నలిస్టుల ముసుగు వేసుకొని తన కుటుంబంపై నీచమైన భాష వాడుతూ ఇష్టం వచ్చినట్లు ప్రచారం చేస్తున్న వారిని సహించేది లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. అలాంటి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. కిరాయి మూకలను అడ్డం పెట్టుకొని పథకం ప్రకారం చేపడుతున్న ప్రచారం వెనుక కేసీఆర్ కుటుంబం ఉందని, ఆయనే వాళ్లను అదుపులో పెట్టుకోవాలని తీవ్ర స్వరంతో హెచ్చరించారు. ఇలాంటి పైశాచిక పోకడలను ప్రోత్సహిస్తే ఎవ్వరినీ వదిలేది లేదని, ఉప్పు పాతర వేయడం ఖాయమని పరోక్షంగా కేటీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తన ఓపిక నశించిందని తెలిస్తే లక్షల మంది అభిమానులు రోడ్ల మీదకు వచ్చి ఒక్కొక్కడినీ గుడ్డలూడదీసి కొడతారని హెచ్చరించారు. ప్రజాజీవితంలో ఉన్న వారిని నీచమైన భాషతో మానసికంగా దెబ్బతీసి ప్రయోజనం పొందాలని చూస్తున్న వారికి చెక్ చెప్పడం కోసం అవసరమైతే చట్టాన్ని సవరిస్తామని శనివారం సభాముఖంగా ప్రకటించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ముఖ్యమంత్రి సభలో సుదీర్ఘంగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన తన ఇంటి ఆడపడుచులను నీచమైన భాషలో నిందిస్తూ మాట్లాడించి, వాటిని ఆడపిల్లల సోషల్ మీడియా ఖాతాల ద్వారా పోస్టింగులు చేయించడంపై తీవ్ర భావోద్వేగంతో స్పందించారు. యూట్యూబ్ ఛానళ్లు, సోషల్ మీడియా కట్టడికి సంబంధించి సభలో ఒకరోజు చర్చ జరపాలని పిలుపునిచ్చారు. పెయిడ్ ఆర్టిస్టుల్ని పార్టీ

తరువాయి 2వ పేజీలో...



### హిందీ నేర్చుకోవాలని ఎవరినీ

# బలవంతపెట్టలేదు!

### ఎన్నికల్లో లబ్ధికి భాష, డీ లిమిటేషన్ పేరుతో స్టాలిన్ దుష్ప్రచారం


### జనగణనే జరగలేదు.. సీట్లు ఎలా తగ్గుతాయి?: కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 15(ప్రజాకలం ప్రతినిధి):** తెలంగాణ, తమిళనాడుల్లో ఏ ఒక్క వ్యక్తినీ హిందీ నేర్చుకోవాలని బలవంతపెట్టలేదని.. తమిళనాడు ఎన్నికల్లో భాగంగానే భాష పేరుతో, డీలిమిటేషన్ పేరుతో స్టాలిన్.. రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా బేగంపేట రైల్వేస్టేషన్‌లో కొనసాగుతున్న పునరాభివృద్ధి పనులను శనివారం కిషన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. మోదీ నాయకత్వంలో అన్ని ప్రాంతీయ భాషలకు ప్రోత్సాహం కల్పిస్తున్నామన్నారు. తమిళనాడులో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగానే ప్రజలను రెచ్చగొట్టే చర్యలకు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ పాల్పడుతున్నారని విమర్శించారు. సీఎంగా స్టాలిన్ ఐదేళ్లు ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. ఎలాంటి అభివృద్ధి చేయలేదు కాబట్టే... భాష పేరుతో, డీలిమిటేషన్ పేరుతో తప్పుడు ప్రచారం చేస్తున్నార న్నారు. తమిళనాడులో త్రిభాష విధానం కొత్తది కాదని, గత యూపీఏ ప్రభుత్వ హయాంలో కూడా ఇదే విధానం ఉందన్నారు. నూతన విద్యావిధానం వచ్చాక మాతృభాషలోనే ఉన్నత విద్యకు ప్రాధాన్యం ఏర్పడింద న్నారు. 'ఇంత వరకు జనాభా గణనే పూర్తికాలేదు. డీలిమిటేషన్ ప్రకారం సీట్లు తగ్గుతాయని

తరువాయి 2వ పేజీలో...

# భానుడి భగభగ..

### ఆదిలాబాద్ జిల్లా పిప్పల్‌ధరిలో 40.8డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత
### భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వడదెబ్బతో మహిళ మృతి
### ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముందన్న వాతావరణశాఖ



ఆదిలాబాద్ మార్చి 15: రాష్ట్రంపై భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. సాధారణం కన్నా ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరగడంతో పగటిపూట బయటకు రావాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా పిప్పల్ ధరిలో అత్యధికంగా 40.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదవగా, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 40.7 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. జనగామ, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో 40.6, నిజామాబాద్, ములుగు, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో 40.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవగా, జగిత్యాల జిల్లాలో 40.3, హనుమకొండ జిల్లాలో 40.2, వరంగల్ జిల్లాలో 39.01, కామారెడ్డి జిల్లాలో 39.7, మహబూబాబాద్ జిల్లాలో 39.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

కాగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలోని పోతురెడ్డిపల్లి గ్రామంలో వడదెబ్బ తగిలి తాటి రత్తాలు (55) అనే మహిళ మృతి చెందింది. తన చెల్లెలి కుమార్తె పెళ్లి సందర్భంగా మూడు రోజులపా టు వివాహ ఆహ్వాన పత్రికలు పంచేందుకు బంధువుల ఇళ్లకు తిరగడంతో వాంతులు, విరోచనాలతో ఆమె స్పృహ తప్పిపడిపోయిం దని, ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించిందని బంధువులు తెలిపారు. రానున్న రెండు మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు హెచ్చరించారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా వడ దెబ్బకు గురికాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచించారు.

### బీఆర్ఎస్ హయాంలో

# విద్యా వ్యవస్థ నాశనం



### ఒక్కొక్కటిగా చక్కదిద్దుతున్నాం: భట్టి

### ట్రోల్స్ చేసేవారిని మా కార్యకర్తలు చూసుకుంటారు: వెంకట్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 15(ప్రజాకలం ప్రతినిధి):** ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల సమగ్ర సమాచారాన్ని ప్రజల ముందు ఉంచుతామని, శాసన సభ ప్రాంగణంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. శనివారం శాసన సభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు భట్టి కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో వర్సిటీలు, విద్యా వ్యవస్థను గాలికొదిలేశారని మండిపడ్డారు. తాము 15 నెలల్లో 11 వేల మంది ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేశామని, 12 మంది వీసీలను నియమించామని వెల్లడించారు. హాస్టల్ విద్యార్థులకు 40 శాతం డైట్ ఛార్జీలను, 200 శాతం కాస్మెటిక్ ఛార్జీలను పెంచామని తెలిపారు. చాకలి ఐలమ్మ యూనివర్సిటీని ప్రపంచంలోనే గొప్ప వర్సిటీగా తీర్చిదిద్దనున్నామని, రూ.15 కోట్లతో చారిత్రక భవనాలను పునరుద్ధరిస్తూ, రూ.540 కోట్లతో కొత్త భవనాలను కడుతున్నామని వెల్లడించారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 58 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా గురుకులాలను కడుతున్నామని చెప్పారు. 2018లో రూ.లక్ష రుణమాఫీని ఐదు వాయిదాల్లో చేస్తే.. తాము రూ.2 లక్షలదాకా రుణమాఫీని ఏకకాలంలో చేశామని చెప్పారు. ప్రధానంగా విపక్ష ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో 2018లో ఎంత రుణమాఫీ జరిగింది..? రూ.2 లక్షల దాకా రుణమాఫీ కింద తాము ఎంత మేలు చేశామనే అంశాన్ని గణాంకాలతో సహా వివరించారు. శాసనసభ ప్రాంగణంలో రైతు రుణమాఫీ, రైతు భరోసాకు సంబంధించిన సమాచారాన్ని

తరువాయి 2వ పేజీలో...

### రాయలసీమ ఎత్తిపోతలకు..

# పర్యావరణ అనుమతి నిరాకరణ

- మళ్లీ విధి విధానాల జారీకి కేంద్రం నిర్ణయం
- ఇది కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన విజయం
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**హైదరాబాద్, మార్చి15(ప్రజాకలం ప్రతినిధి):** శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి నీటిని తరలించడానికి ఉద్దేశించిన రాయలసీమ ఎత్తిపోతల పథకానికి కేంద్ర అటవీ శాఖ నిపుణుల మదింపు కమిటీ(ఎక్స్‌పర్ట్ అప్రైజల్ కమిటీ) అనుమతిని నిరాకరించింది. గతనెల 27న వివిధ ప్రాజెక్టుల అనుమతి కోసం జరిగిన ఈఏసీ సమావేశంలో ఈ ప్రాజెక్టుకు మళ్లీ అనుమతి కోసం విధివిధానాల (టర్మ్ అండ్ రిఫరెన్స్)ను జారీ చేయాలని నిర్ణయించారు. ఈ ప్రాజెక్టుకు ఎట్టి పరిస్థితుల్లోనూ పర్యావరణ అనుమతి ఇవ్వరాదని కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖకు రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఆ శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా లేఖలు రాశారు.

తరువాయి 2వ పేజీలో...



### 'పునర్విభజన'పై అన్ని పార్టీలతో చర్చిద్దాం

### జానారెడ్డితో భేటీలో డిప్యూటీ సీఎం భట్టి
### త్వరలో వేదిక, సమయం ఖరారు

హైదరాబాద్, మార్చి 15: పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజనపై అన్ని పార్టీలతో చర్చిద్దామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఈ అంశంపై చర్చించే వేదిక, సమయాన్ని ఖరారు చేయడానికి శనివారం ఆయన మాజీ మంత్రి కే జానారెడ్డి ఇంటికి వెళ్లి భేటీ అయ్యారు. ఇరువురు కొంత సేపు చర్చించుకున్నారు. అఖిలపక్ష సమావేశం నిర్వహణకు సచివాలయం లేదా పూలే ప్రజా భవన్‌లో ఏదో ఒకదానిని ఖరారు చేయాలన్న యోచనకు వచ్చారు. పునర్విభజనపై అఖిల పక్షంతో చర్చించే బాధ్యతలను భట్టివిక్రమార్క, జానారెడ్డిలకు సీఎం రే వంత్‌రెడ్డి అప్పగించిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే ఈ భేటీ జరిగింది. వీరిద్దరూ కలిసి ఇప్పటికే రాజకీయ పార్టీలకు బహిరంగ లేఖ కూడా విడుదల చేశారు. రాజకీయాలకు అతీతంగా, అన్ని పార్టీల నాయకులతో చర్చించి, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలన్న నిర్ణయానికి వచ్చారు. ఈ మేరకు అన్ని పార్టీల నాయకులతో శనివారమే ఫోన్‌లో మాట్లాడారు. వేదిక, సమయంపై వారి అభిప్రాయాలు తీసుకున్నారు. వీటిని ఖరారు చేస్తామని వెల్లడించారు.

# భట్టివి తప్పుడు లెక్కలు

### రుణమాఫీ లెక్కలు నిజమని నిరూపిస్తే రాజీనామాలు చేస్తాం - బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేముల, పల్లా సవాల్

### కాంగ్రెస్, బీజేపీ ఎమ్మెల్యే మధ్య లోపాయికారి ఒప్పందం: వివేకానంద - బీఆర్ఎస్ ఎమ్మెల్యేల వాకౌట్

**హైదరాబాద్, మార్చి 15(ప్రజాకలం ప్రతినిధి):** రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క నియోజకవర్గాల వారీగా జరిగిన రుణమాఫీ ఇదంటూ అసెంబ్లీలో చెప్పిన వివరాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేముల ప్రశాంత్ రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. భట్టివి తప్పుడు లెక్కలని ఆక్షేపించారు. రుణమాఫీ లెక్కలు నిజమని నిరూపిస్తే తమ శాసనసభ సభ్యత్వాలకు రాజీనామాలు చేస్తామని సవాల్ చేశారు. శాసనసభ, అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్యేలు వేముల, పల్లా శనివారం మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో రెండు విడతల్లో రూ.29 వేల కోట్లు రుణమాఫీ జరిగిందని, కాంగ్రెస్ నాలుగు విడతల్లో రూ.21 వేల కోట్లు రుణమాఫీ చేసిందని ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. తాను ప్రాతినిధ్యం వహించే బాల్కొండ నియోజకవర్గంలో కేసీఆర్ హయాంలో ఇచ్చిన రుణమాఫీ కంటే ఇప్పుడు ఎక్కువ రుణమాఫీ చేశామని ప్రభుత్వం నిరూపిస్తే తన పదవికి రాజీనామా చేస్తానని సవాలు చేశారు.



ఆరు గ్యారెంటీలు, హామీల అమలుపై ముఖ్యమంత్రి ప్రసంగంలో స్పష్టత ఇవ్వలేదని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి 15 నెలలు పూర్తవుతున్నా. గత. బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఇంకా ఎందుకు ఏడుస్తున్నారని నిలదీశారు. కేసీఆర్ చావును కోరుతూ సీఎం రేవంత్ రెడ్డి జుగుప్సాకర వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. ప్రతిపక్షనేతను సంప్రదించకుండా పీఏసీ ఛైర్మన్ పదవిని పార్టీ మారిన ఎమ్మెల్యేకి ఎలా ఇస్తారని ప్రశాంత్ రెడ్డి ప్రశ్నించారు. ఇక, జనగామ నియోజకవర్గంలో ఏ ఒక్క గ్రామంలోనైనా సరే వంద శాతం రుణమాఫీ జరిగినట్లు నిరూపిస్తే అక్కడికక్కడే ముక్కునేలకు రాసి, శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తానని పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రభుత్వం మార్చేసిందని.. ఇప్పుడు కాకతీయ కళాతోరణం, చార్మినార్‌ను రాజముద్ర నుంచి తీసెయ్యాలని చూస్తుందని.. అలా చేస్తే ఊరుకో మని హెచ్చరించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణ తల్లి విగ్రహాలను మారుస్తామని, రాజముద్రను పునరుద్ధరిస్తామని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బాకీలు రూ.8వేల కోట్లు ఉండగా, 15 నెలల్లో ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ కుప్పకూలిందని వివరించారు. జర్నలిస్టులు రేవతి, తన్వియాదవ్‌పై నమోదు చేసిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కల్పించుకొని.. ఆ వీడియోలను శాసనసభలో ప్రదర్శిద్దామని, సభ్యులు ఆ వీడియోను సమర్థిస్తే కేసులు తొలగిద్దామని బదులిచ్చారు.

## కేసీఆర్ కుటుంబం మొత్తం బతికేది

# అబద్ధాల మీదే..

మొదటి పేజీ తరువాయి...

ఆఫీసులో పెట్టి, తిట్లను రికార్డు చేసి సోషల్ మీడియాలో పెట్టిన వారిపై పోలీసులు కేసులు పెడితే బీఆర్ఎస్ వారికి ఎందుకు దుఃఖం వస్తోందని ప్రశ్నించారు. ఇదే కేసీఆర్ 2014-15 మధ్యకాలంలో కొత్త ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేసినప్పుడు టీవీ 9, ఏబీఎన్‌లలో చిన్న సన్నివేశం ప్రసారం చేస్తే ఏకంగా ఏడాది కాలం బ్యాన్ చేశారని గుర్తు చేశారు. జర్నలిస్టుల ముసుగు వేసుకున్న కొందరు వ్యక్తులు తమ ఎకౌంట్లలో పెడుతున్న భాష వింటుంటే తన రక్తం మరుగుతోందన్నారు. ప్రజాజీవితంలో ఉన్నాం కాబట్టి ఓపిక పడుతున్నామని వ్యాఖ్యానించారు. "సీఎం కుటుంబ సభ్యుల్ని అంత మాటలంటున్నారంటే మీరు మనుషులేనా? మీకు భార్యబిడ్డలు, తల్లిదండ్రులు లేరా? మీ అమ్మనో, చెల్లినో, భార్యనో ఈ రకంగా మాట్లాడితే వింటావా? అరెస్టను ఖండిస్తూ ట్విట్టర్ పోస్టును పెట్టిన వారిని(కేటీఆర్) ప్రశ్నిస్తున్నా. నా భార్యను, నా బిడ్డను తిడితే నాకు నొప్పి అయితది. ఒక ఆడబిడ్డను అవమానిస్తే మీకు నొప్పి కాదా? మనం ఏ సంస్కృతిలో ఉన్నాం" అని విపక్షాన్ని నిలదీశారు.

ప్రజాజీవితంలో ఉన్న నేతలను విమర్శించడంలో తప్పులేదని, దాన్ని వదిలేసి, ఇంట్లో ఉండే ఆడోళ్ల గురించి మాట్లాడే సంస్కృతి ఎక్కడి నుంచి నేర్చుకున్నారని ప్రశ్నించారు. తెలంగాణ పోరాట సంస్కృతిని సర్వనాశనం చేసి విష సంస్కృతిని తెచ్చి, నోటికొచ్చింది మాట్లాడించి పోస్ట్ చేస్తున్నారన్నారు. "వారు తిట్టిన తిట్లకు నా పేరు తీసేసి మీ పేరు రాసుకోండి అక్కడ. మీకు అన్నం తినబుద్ధి అయితదో నేను చూస్తా" అని కేటీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తెలంగాణ ముఖ్యమంత్రి బలహీనుడు కాదని, ఓపిక పట్టి, మర్యాద కోసం ఉంటున్నానని గ్రహించాలని చెప్పారు. "కేసీఆర్, మీ పిల్లలకు బుద్ధి చెప్పండి. ఇది మంచిది కాదు. మాట జారితే దాని ఫలితం ఎలా ఉంటదో అనుభవిస్తారు. ఆత్మగౌరవాన్ని చంపుకుని పదవికోసం లాలూచీ పడి దిగజారే రాజకీయాలు చేయను. ఉన్నంత కాలం నిటారుగా ఉంటా. ఏదీ పడితే అది మాట్లాడితే ఇక నుంచి ఊరుకోను. కోర్టుకు పోతే బెయిలొస్తది, చేతనైనంత వరకు మానసికంగా దెబ్బతీసి ప్రయోజనం పొందాలనుకుంటున్నారేమో. అవసరమైతే చట్టాన్ని సవరిస్తాం. ఆడపిల్లలు ఆ రకమైన భాషను వాడి ఆడపిల్లలే వాళ్ల ప్లాట్‌ఫామ్‌లలో పోస్టు చేయడం మంచిదా? తెలంగాణలో ఇలాంటి సాంప్రదాయం ఎప్పుడైనా ఉందా? ఉద్యమ సమయంలోనూ ఈ తరహా భాషాప్రయోగం జరగలేదు" అన్నారు.

**జర్నలిస్టులెవరో గుర్తించండి**

రాష్ట్రంలో జర్నలిస్టులెవరో మీడియా సంఘాలే గుర్తించాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. వాళ్ల లిస్టులో ఉన్న జర్నలిస్టులు తప్పు చేస్తే ఏ శిక్ష వేయాలో సంఘాలే చెప్పాలని కోరారు. జాబితాలో లేనివాడు జర్నలిస్టు ముసుగు వేసుకొని వస్తే కిమినల్స్‌కు ఎలా జవాబు చెప్పాలో గట్లనే చెబుతామని, గుడ్డలు ఊడదీసి కొడతా అని ఘాటుగా హెచ్చరించారు. తానూ మనిషినేనని, చీమూ నెత్తురూ ఉందని, సీఎం కుర్చీలో ఉన్నందుకు అన్నింటినీ భరిస్తాననే భ్రమలు పెట్టుకోవద్దని అన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న నేపథ్యంలో చట్ట పరిధిలోనే అన్ని శిక్షలూ పడేట్లు చూస్తామని చెప్పారు. "ఈ విశృంఖలత్వాన్ని ఆపాలి. భవిష్యత్తులో ఇది తెలంగాణకు చీడ పురుగులా మారుతుంది. దీనిపై సభలో చర్చిద్దాం. ఒక చట్టాన్ని చేద్దాం. సభాపతి ఆదేశిస్తే సంబంధిత మంత్రి జర్నలిస్టు సంఘాలను పిలిచి మాట్లాడతారు. ఒక మంచి సంప్రదాయానికి తెలంగాణ వేదిక కావాలి. స్వీయ నియంత్రణతో పాటు రాజ్యాంగపరమైన నియంత్రణ కూడా అవసరమే" అన్నారు.

**దుబాయ్ రికార్డులు ఉన్నాయ్**

ఫాంహౌసల్లో డ్రగ్స్ పార్టీలు, కోళ్ల పందాలు సహించేది లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జన్వాడ ఫాంహౌసలో డ్రగ్స్ పార్టీలు, ఫాంహౌసల్లో కోళ్ల పందాలు నిర్వహించిందెవరో తెలుసునన్నారు. దుబాయ్‌లో డ్రగ్స్ తీసుకుని చనిపోయిన వ్యక్తి ఎవరికి మిత్రుడని సీఎం సీఎం ప్రశ్నించారు. మిత్రుడు చనిపోతే శవాన్ని కూడా ఇక్కడికి తీసుకురాకుండా దుబాయ్ వెళ్లి పైరవీలు చేసి అక్కడే దహనం చేయించిన చరిత్ర ఎవరిది అని అడిగారు. సదరు వ్యక్తి సభకు వస్తే అన్ని వివరాలు అప్పుడు చెబుతానన్నారు. మొత్తం రికార్డులు దుబాయ్ నుంచి తెప్పించానని, అన్ని గుట్లు, మట్లు తన దగ్గర ఉన్నాయని వ్యాఖ్యానించారు. సమయం, సందర్భం వచ్చినప్పుడు అన్నీ ముందు పెడతానని చెప్పారు.

**అబద్ధాలు తిని బతుకుతున్నారా?**

కేసీఆర్ కుటుంబం మొత్తం అబద్ధాల మీదే బతుకుతోందని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. ఎక్కడైనా చిన్న సంఘటన జరిగితే దాన్ని తీసుకుని చిలువలు పలువలు చేసి ప్రచారం చేస్తున్నారన్నారు. ఎక్కడైనా ఎవరైనా చనిపోయారని టీవీలు, పేపర్లలో వస్తే తలుపులు మూసుకుని తాండవం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రిగా తాను చేసే ఖర్చులకు పక్కాగా లెక్క ఉంటుందని రేవంత్ అన్నారు. కేసీఆర్ దేవుళ్లకు మొక్కుకుంటే వ్యక్తిగత విషయానికి ప్రభుత్వ సొమ్ము నుంచి మొక్కులు చెల్లించారని, కిలోల కొద్దీ బంగారం ఇచ్చారని ప్రస్తావించారు. కేసీఆర్ ఎక్కడికెళ్లినా చార్టెడ్ ఫ్లైట్‌లోనే తిరిగారని చెప్పారు.

## హిందీ నేర్చుకోవాలని ఎవరినీ

# బలవంతపెట్టలేదు!

మొదటి పేజీ తరువాయి...

ఎలా చెప్పగలరు? దక్షిణ భారతదేశంలో గతంలో లాగా ప్రజలను రెచ్చగొడితే ప్రజలు ఊరుకోరు. చైతన్యవంతమయ్యారు. తమిళభాషలో తీసిన సినిమాలను హిందీలోకి డబ్బింగ్ చేసి వేల కోట్లు సంపాదిస్తున్నారు' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

**విమానాశ్రయాల్లా రైల్వే స్టేషన్లు**

కేంద్రం అధునికీకరించబోయే రైల్వే స్టేషన్లన్నీ ఎయిర్‌పోర్టుల్లా అంతర్జాతీయ స్థాయిలో సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కిషన్‌రెడ్డి వెల్లడించారు. బేగంపేట రైల్వేస్టేషన్‌ను మహిళా లోకానికి అంకితమివ్వాలని ప్రధాని మోదీ నిర్ణయించారని, ఈ రైల్వే స్టేషన్‌లో సెక్యూరిటీ గార్డుల నుంచి అధికారుల వరకు అందరూ మహిళా ఉద్యోగులే ఉంటారని తెలిపారు. రూ.26 కోట్లతో తొలివిడత చేపట్టిన పనులు 90 శాతం పూర్తయ్యాయని, రూ.12 కోట్లతో రెండో విడత పనులను చేపడతామన్నారు. తెలంగాణలో ఈ సంవత్సరం రూ.5,337 కోట్లతో ఆధునికీకరణ, రూ.39,300 కోట్లతో రైల్వేల అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ తొలివిడత ఆధునికీకరణ పనులు రూ.715 కోట్లతో వచ్చే ఏడాదికి పూర్తవుతాయన్నారు. నాంపల్లి రైల్వేస్టేషన్ పనులు రూ.327 కోట్లతో ప్రారంభమయ్యాయని తెలిపారు. చర్లపల్లి రైల్వేస్టేషన్ అప్రోచ్ రోడ్డుపై నిర్ణయం తీసుకుంటే పనులు త్వరగా పూర్తవుతాయన్నారు. నగరంపై భారం పడకుండా చర్లపల్లి నుంచి రైళ్లను పడపాలనే ప్రణాళికలు ఉన్నాయని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

**పార్టీ ఎమ్మెల్యేలతో కిషన్‌రెడ్డి భేటీ**

అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలని పార్టీ ఎమ్మెల్యేలకు కిషన్‌రెడ్డి సూచించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలులో వైఫల్యంపై గట్టిగా నిలదీయాలని చెప్పారు. శనివారం రాత్రి దిల్‌కుషా గెస్ట్‌హౌసలో బీజేపీ ఎమ్మెల్యేలతో కిషన్‌రెడ్డి సమావేశమయ్యారు. అసెంబ్లీ సమావేశాల్లో ఎవరెవరు ఏయే విషయంపై మాట్లాడాలో ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు.

**ప్రజల్లో అసంతృప్తి.. అందుకే డ్రామాలు**

తమిళనాడులో డీఎంకేపై ప్రజల్లో వ్యతిరేకత ఉందని.. అందుకే నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాదికి కేంద్రం అన్యాయం చేయనుందని డ్రామాలు మొదలుపెట్టారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. కరీంనగర్‌లో ఆయన విలేకరులతో మాటాడారు. సమస్యలతో సతమతమవుతున్న తమిళులు డీఎంకే ప్రభుత్వంపై కసితో ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ విషయానికొస్తే.. తెలంగాణతోపాటు కర్ణాటకలోనూ ఆ పార్టీ పరిస్థితి మరీ దారుణంగా తయారైందన్నారు. ఈ పార్టీలన్నీ కలిసి బీజేపీని దెబ్బతీసి రాజకీయ లబ్ధి పొందేందుకు చూస్తున్నాయని సంజయ్ ఆరోపించారు. హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పేరిట, తబ్లిగీ జమాతే సంస్థ సమావేశాల పేరిట కోట్లు ఖర్చు చేస్తున్నారని, వీటి వల్ల హైదరాబాద్ బ్రాండ్ పెరుగుతుందా? అని ప్రశ్నించారు. హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ వద్ద ఉన్న వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను అమ్ముకోవాలని చూస్తున్నారన్నారు. జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేసి ప్రజల దృష్టిని మళ్లించడానికి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుపును జీర్ణించుకోలేక కాంగ్రెస్, బీఆర్ఎస్ కొత్త ఎత్తుగడలు వేస్తున్నాయని పేర్కొన్నారు. రాజాసింగ్ వ్యాఖ్యలను తాను వినలేదని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

**ఆ భూములు వృక్ష, పక్షి సంపదకు నిలయం**

హెచ్‌సీయూకి చెందిన 400 ఎకరాల భూమిని విక్రయించాలనే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ తరపున ఉద్యమిస్తామన్నారు. క్యాంపసలో ఉన్న 400 ఎకరాల భూమి అరుదైన వృక్ష, పక్షి సంపదకు నిలయంగా ఉందని చెప్పారు.

## రాయలసీమ ఎత్తిపోతలకు.. పర్యావరణ అనుమతి నిరాకరణ

మొదటి పేజీ తరువాయి...

నేరుగా కలిసి, ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. దీంతో.. రాయలసీమ ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతిని నిరాకరిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందించారు. శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను అక్రమంగా తరలించడానికి చేపట్టిన ఈ పథకానికి పర్యావరణ అనుమతి నిరాకరించడం పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన విజయమంటూ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. "ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కృష్ణా జలాలపై ఏ ప్రాజెక్టును నిర్మించాలన్నా.. కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) డీపీఆర్‌ను పరిశీలించాల్సి ఉంటుంది. కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) క్లియరెన్స్, టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ(టీఏసీ) సాంకేతిక అనుమతి, అపెక్స్ కౌన్సిల్ అనుమతి తప్పనిసరి. నీటి కేటాయింపులు లేకుండా ఏ విధంగా ప్రాజెక్టు నిర్మాణం చేపడతారు?" అని ఆయన ప్రశ్నించారు. కృష్ణా జలాలపై విచారణ కీలక దశలో ఉన్న సమయంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, అప్పటి నుంచి తెలంగాణ నీటి వాటాను కాపాడేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే రాయలసీమ ఎత్తిపోతలకు వ్యతిరేకంగా ఎన్‌జీటీలోనూ పోరాటం చేస్తున్నామని, కృష్ణా జలాల్లో న్యాయమైన వాటాను సాధించడానికి ట్రిబ్యునల్‌లో బలమైన వాదనలను వినిపిస్తున్నామని వివరించారు. తెలంగాణ వాదనతో అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదం చట్టం-1956లోని సెక్షన్-3 ప్రకారం రాష్ట్రాలవారీగా నీటి కేటాయింపులపై వాదనలు వినాలని ట్రిబ్యునల్ నిర్ణయం తీసుకుందని, ఇది కూడా పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిన విజయమని పేర్కొన్నారు. "రాయలసీమ ఎత్తిపోతల పథకంపై కేంద్ర పర్యావరణ శాఖ మంత్రిని కలిశాం. వాస్తవాలను వివరించాం. ఎన్‌జీటీ ఉత్తర్వులను ఉల్లంఘించి, రాయలసీమ ఎత్తిపోతలను ఏపీ నిర్మిస్తోందనే విషయాన్ని స్పష్టంగా చెప్పడం వల్లే.. పర్యావరణ అనుమతి ఆగిపోయింది. రాయలసీమ ఎత్తిపోతలను అడ్డుకోకపోతే తెలంగాణలో సాగు, తాగునీటికి ఇబ్బందులు తలెత్తేవి" అని వ్యాఖ్యానించారు.

## బీఆర్ఎస్ హయాంలో

# విద్యా వ్యవస్థ నాశనం

అందుబాటులో ఉంచుతామని ప్రకటించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ సంక్షేమ పథకం వివరాలను లెక్కలతో సహా ఎమ్మెల్యేలకు ఇస్తామని భట్టి తెలిపారు.

**జగదీశ్‌రెడ్డి హావభావాలు అహంకారపూరితం: శ్రీధర్‌బాబు**

ఈ బడ్జెట్ సమావేశాల్లోనే అసెంబ్లీ ఎథిక్స్ కమిటీని ఏర్పాటు చేస్తామని శాసన సభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. అసెంబ్లీలోని తన చాంబర్‌లో ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. స్పీకర్‌ను ఉద్దేశించి జగదీశ్‌రెడ్డి మాట్లాడిన రికార్డులను పరిశీలించామని.. ఆయన మాటతీరు, హావభావాలు అహంకార పూరితంగా ఉన్నాయని అన్నారు. అందుకే తమ సభ్యులు అభ్యంతరాలు తెలిపారని చెప్పారు. శాసన సభ సభ్యుడిపై అనర్హత వేటు అన్నది స్పీకర్ తీసుకునే నిర్ణయమని అన్నారు. కాగా, ఫార్ములా-ఈ రేసును హైదరాబాద్‌లో నిర్వహించడాన్ని తాము ఎన్నడూ తప్పు పట్టలేదని, రేసుకు చెల్లింపులు జరిపిన విధానాన్నే తప్పుబట్టామన్నారు. హైదరాబాద్‌లో జరగనున్న మిస్ వరల్డ్ పోటీలకు సంబంధించిన వివరాలను నిర్వాహకులు ఏప్రిల్ 19న ప్రకటిస్తారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించనున్న భారత్ సమ్మిట్.. ఏప్రిల్ నెలాఖరులో జరిగే అవకాశం ఉందన్నారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీల కంటే మెరుగ్గా ప్రభుత్వ కాలేజీలను నడుపుతామని సభలో శ్రీధర్‌బాబు ప్రకటించారు. బీఆర్ఎస్ సర్కారు ఐదేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో రూ.8 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని, ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేనప్పటికీ తాము ప్రణాళికాబద్ధంగా చెల్లింపులు చేస్తున్నామని చెప్పారు.



**విందులిచ్చి.. నీళ్లొదిలేశారు: ఉత్తమ్**

బీఆర్ఎస్ చేతకానితనం, అసమర్థత వల్లే కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరిగిందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి శాసన సభలో విమర్శించారు. ప్రగతి భవన్‌లో విందులు చేసుకుని శ్రీశైలం నుంచి ఏపీకి నీటి తరలింపునకు అంగీకారం తెలిపారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలోనే రాయలసీమ ఎత్తిపోతల పథకం నిర్మాణం జరిగిందని, పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని 88 వేల క్యూసెక్కులకు పెంచుకున్నారని విమర్శించారు. ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీల కృష్ణా జలాలను కేటాయిస్తే.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 299 టీఎంసీలు తెలంగాణకు చాలని, 512 టీఎంసీలు ఏపీకి తీసుకెళ్లేలా సంతకాలు చేసింది ఎవరని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చాక కృష్ణా నీటి కోసం కృష్ణా ట్రిబ్యునల్‌లో న్యాయ పోరాటం చేస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ సర్కారు చేసిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఎక్కడా బయటపెట్టలేదని వెల్లడించారు. తాము శాస్త్రీయంగా కులగణన చేశామని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఎస్సీ వర్గీకరణ చేస్తున్నామని ఉత్తమ్ వెల్లడించారు.

**మేం చేసిన అప్పు 4,500 కోట్లే: వెంకట్‌రెడ్డి**

సోషల్ మీడియాలో తమపై ట్రోల్స్ చేసేవారి సంగతి ఇకపై తమ కార్యకర్తలే చూసుకుంటారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ లాబీల్లో ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. శ్రీశైలంలో చిన్న మాట దొర్లితే ఉద్దేశపూర్వకంగా తనను ట్రోల్ చేశారని చెప్పారు. ఆ రోజు తాను చిన్నసమోసా తప్ప ఏమీ తినలేదనీవివరణ ఇచ్చారు. సీఎం రేవంత్ ప్రసంగంలో అప్పులు, వడ్డీ లెక్కలు స్పష్టంగా అర్థమయ్యేలా చెప్పారని అన్నారు. ఈ 15 నెలల్లో తాము చేసిన అప్పు రూ. 4,500 కోట్లేనన్నారు. కాగా, ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఏకకాలంలో రూ.21 వేల కోట్ల రైతు రుణాలను మాఫీ చేశామని మంత్రి వెంకట్‌రెడ్డి సభలో మాట్లాడారు.

**సోషల్ మీడియాకు కట్టడి అవసరం : సీతక్క**

సోషల్ మీడియాకు కట్టడి అవసరమని మంత్రి సీతక్క అన్నారు. ఈ మీడియా ద్వారా బీఆర్ఎస్ చల్లిన బురదను కడుక్కోవడమే తమ వంతు అవుతోందన్నారు. మహిళలు రాజకీయాల్లో ఎదగడమే కష్టమని, అలాంటిది ఎన్నో కష్టాలు పడి ఈ స్థాయికి వచ్చిన తమను సోషల్ మీడియా ద్వారా ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. సోషల్ మీడియా ప్రభావంపై సీఎం రేవంత్‌రెడ్డి సభలో మాట్లాడటం తమకు ఎంతో ఊరట ఇచ్చిందన్నారు. సోషల్ మీడియాలో తన ఫొటోలను మార్ఫింగ్ చేసి, మానసికంగా ఇబ్బంది పెట్టారని అన్నారు.

**శ్రీధర్‌బాబు వస్తుంటే సీఎం వచ్చినంత హంగామా**

మంత్రి శ్రీధర్‌బాబు అసెంబ్లీకి వస్తుంటే సీఎం వచ్చినంత హంగామా ఉంటోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సరదాగా వ్యాఖ్యానించారు. అసెంబ్లీకి శ్రీధర్‌బాబు వచ్చిన సమయంలో మంత్రి కోమటిరెడ్డి ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా ఆయన శ్రీధర్‌బాబుపై సరదా వ్యాఖ్య చేశారు. దీంతో అక్కడ ఉన్న అసెంబ్లీ సిబ్బంది, అధికారులు ఒక్కసారిగా నవ్వారు. 'వెంకన్న నాపై అభిమానంతో అలాగే అంటారు.. మీరు పట్టించుకోవద్దు..' అని శ్రీధర్‌బాబు సరదాగా వారినుద్దేశించి అన్నారు.